ప్రజాశక్తి
సోమవారం 22 సెప్టెంబరు, 2025 5
శ్రీకాకుళం

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం సిటీ: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని శ్రీకాకుళం రెండో పట్టణ సిఐ పి.ఈశ్వరరావు అన్నారు. స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని చెప్పారు. నేరాలు, ఘర్షణలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాళ్లు అలా... వీళ్లు ఇలా...

సమావేశాన్ని వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

- జెడ్‌పి సమావేశానికి ఒక్కరూ హాజరు కాని కూటమి ప్రజాప్రతినిధులు
- ప్రోటోకాల్ ఉల్లంఘన పేరుతో వైసిపి సభ్యులు వాకౌట్
- ప్రజా సమస్యలు చర్చించకుండానే ముగిసిన వైనం
- ప్రజాప్రతినిధుల తీరుపై జనం విస్మయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లడం మానేస్తుంటే, వైసిపి సభ్యుల ప్రశ్నలకు మనమెందుకు సమాధానం చెప్పాలనే ఉద్దేశంతో కూటమి ఎమ్మెల్యేలు జెడ్‌పి సర్వసభ్య సమావేశాలకు రావడం మానేస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలోనే ఉన్నా డుమ్మా కొట్టారు. కూటమి పార్టీలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఆ రోజు హాజరయ్యారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కూటమి పార్టీలకు చెందిన మంత్రితో సహా ఒక్క ఎమ్మెల్యే కూడా హాజరు కాలేదు. సమావేశానికి వైసిపి చెందిన సభ్యులు అత్యధిక మంది హాజర్రైనా, ప్రోటోకాల్ ఉల్లంఘన సమస్యతో మొత్తం సభ్యులంతా సమావేశాన్ని వాకౌట్ చేశారు. దీంతో ప్రజా సమస్యలు చర్చించకుండానే ఈసారి సమావేశం ముగిసింది. టిడిపి, వైసిపి సభ్యుల తీరుపై అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జెడ్‌పి సమావేశ మందిరంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11.30 గంటలకు మొదలైంది. తొలుత ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఈనెల 16న పాలకొండ మండల సర్వసభ్య సమావేశానికి వెళ్తున్న తనను గేట్ వద్దే పోలీసులు అడ్డకుని, నెట్టేసి తనను తీవ్రంగా అవమానపరిచారని చెప్పారు. తనను తొలుత సమావేశానికి ఆహ్వానించి, ఆ తర్వాత రావద్దంటూ లేఖ పంపి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక అక్కడ్నుంచి వైసిపి సభ్యులు ఒక్కొక్కరుగా లేచి ప్రోటోకాల్ ఉల్లంఘన, ఎమ్మెల్సీకి జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ జెడిపి నిధులతో ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి తాగునీరు అందిస్తున్నా, ప్రారంభోత్సవానికి తనను పిలవలేదని సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మండలాల్లో తమకు జరుగుతున్న అవమానాలనూ ప్రస్తావించారు.

వాకౌట్‌కు దారితీసిన సందర్భం ఇదే...

టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి మాట్లాడుతూ ఎమ్మెల్సీని అవమానిస్తే చర్యలు తీసుకోవడానికి ఎన్నాళ్లు సమయం తీసుకుంటారని ప్రశ్నించారు. సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాలవలస వసంతరెడ్డి మాట్లాడుతూ పోర్టు నిర్వాసిత కాలనీ శంకుస్థాపనకు తనను పిలవకుండా అవమానించారని చెప్పారు. ఎమ్మెల్సీకి జరిగిన అవమానంపై సమాధానం చెప్పిన తర్వాతే సమావేశం కొనసాగించాలన్నారు. తర్వాత సంతకవిటి జెడ్‌పిటిసి జగన్మోహనరావు మాట్లాడుతూ అధికారుల నుంచి సమాధానం రావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా మాట్లాడుతూ ముందు చెప్పేది వినాలని, నివేదిక వచ్చే వరకు చర్యలు తీసుకోలేమంటూ బదులిచ్చారు. దీనిపై జెడ్‌పిటిసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోడియం వైపు దూసుకొచ్చారు. ఆయనకు మద్దతుగా మరికొంత మంది సభ్యులు వచ్చి జెడ్‌పి సిఇఒతో వాగ్వాదానికి దిగారు. ఇదే క్రమంలో మీరు సిఇఒను సమర్థిస్తున్నారా అంటూ జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయనుద్దేశించి జెడ్‌పిటిసి జగన్మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేయడంతో, ఆమె సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించడంతో అందరూ బయటకు వచ్చేశారు.

సమావేశ మందిరం వెలుపల నిరసన

ఎమ్మెల్సీ విక్రాంత్‌కు అవమానం, ప్రోటోకాల్ ఉల్లంఘనలపై వైసిపి సభ్యులు సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. పాలకొండ ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలని, ప్రోటోకాల్ పాటించాలంటూ నినాదాలు చేశారు. జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రోటోకాల్ ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. గతంలోనే మంత్రి అచ్చెన్నాయుడు చెప్పినా పిలవకుండా అవమానపరుస్తున్నారని చెప్పారు. ఎంపిడిఒపై చర్యలు తీసుకునే వరకు ఎటువంటి సమావేశాలు నిర్వహించబోమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ పాలకొండ మండల సమావేశానికి పిలవకుండా అవమానించడంతో పాటు తనను నెట్టేసిన ఎంపిడిఒతో పాటు సభ్యులపై అగౌరవంగా మాట్లాడిన జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజాపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మారని అచ్చెన్న తీరు

జెడ్‌పి సర్వసభ్య సమావేశాలకు హాజరయ్యే విషయంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీరు మారలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 28న నిర్వహించిన జెడ్‌పి సర్వసభ్య సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాలోనే ఉండి రాలేదు. ఆ రోజు నిమ్మాడ కేంప్ కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖలపై సమీక్షించిన ఆయన సర్వసభ్య సమావేశానికి మాత్రం డుమ్మా కొట్టారు. సమీక్షలు తర్వాత ఉద్దానం మంచినీటి పథకం ఫేజ్-2 ప్రారంభానికి పాతపట్నం వెళ్లారు. ఈ సమావేశానికీ ఆయన హాజరు కాలేదు. వాస్తవానికి మంత్రి అచ్చెన్నాయుడును సంప్రదించిన తర్వాతే అధికారులు సమావేశం తేదీని ఖరారు చేస్తారు. సమావేశానికి హాజరవుతారని అంతా ఎదురుచూసినా రాలేదు. ఆయనతో పాటు కూటమి పార్టీలకు చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా రాకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి సభ్యులకు మనమెందుకు సమాధానం చెప్పాలనా, సమావేశాలు అంటే చులకనభావమో తెలియదు గానీ జిల్లా సమస్యలపై చర్చకు అవకాశం లేకపోయింది. అధికారంలో ఉండి కూటమి ప్రజాప్రతినిధులు హాజరు కాక, సమావేశానికి వచ్చి కూడా ప్రజా సమస్యలను చర్చించకుండా ప్రోటోకాల్ ఉల్లంఘన పేరుతో వాకౌట్ చేయడం రెండూ ప్రజలకు నష్టం కలిగించేదే. ఇకనుంచైనా సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి తమను ఎన్నుకున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని కోరుతున్నారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుద్దీపాల అలంకరణ

కొత్తమ్మతల్లి

రేపట్నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు 25వ తేదీతో ముగియనున్నాయి. ఏటా ఈ ఉత్సవాలు మహాలయ అమావాస్య తర్వాత వచ్చే గురువారం నాడు ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు జిల్లా, ఉత్తరాంధ్ర ప్రాంతవాసులే కాకుం డా తెలంగాణ, ఒడిశా నుంచి యాత్రికులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఈ ఏడాది కూడా ఈ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ పండగగా ప్రకటించడంతో పాటు ఉత్సవాలు ప్రారంభమై వందేళ్లు కావడంతో శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అధికార యంత్రాంగం అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయు డు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో పాటు ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో, స్థానిక పెద్దల పర్యవేక్షణలో గ్రామ పెద్దల సూచనలు, సహాయ సహకారాలతో ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ నిర్వహిస్తున్నారు.

ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు

మూడు రోజులు పాటు నిర్వహించే కొత్తమ్మతల్లి ఉత్సవాలు రాష్ట్రస్థాయి ఉత్సవాలుగా నిర్వహించాలని ప్రభుత్వం అదేశించడంతో భారీగా ఏర్పాట్లు చేశారు. కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రెండు కిలోమీటర్లు పొడవునా కొత్తపేట వరకు విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. లైటింగ్‌తో కూడిన వెంకటేశ్వర ఆలయం, కొత్తమ్మతల్లి ఆలయం వంటి భారీ కటౌట్లు చూపరులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు వచ్చే వారికి ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జెయింట్ వీల్, శాలంబో, బ్రేక్ డాన్స్, కారు, మోటార్ సైకిల్ విన్యాసాలు ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేశారు. 24వ తేదీ సాయంత్రం కొత్తపేట జంక్షన్ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నారు. దర్శనానికి వచ్చే యాత్రికులకు దేవస్థానం వారు ఉచిత ప్రసాదాల పంపిణీ, ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. యాత్రికులకు వైద్యశాఖ ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తోంది.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే ప్రావీణ్యం పొందిన కబడ్డీ, సంగిడీ రాళ్ళ, ఈడ్పురాయి, ఉలవల బస్తాలు పోటీలు మూడు రోజుల పాటు తేదీల్లో నిర్వహిస్తారు. పగటి వేషాలు, కోయ నృత్యాలతో పాటు మూడు రోజుల రాత్రులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈసారి హెలీకాప్టర్ రైడ్, లేజర్ షోలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల మూడు రోజులూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వాతావరణ పరిస్థితులను బట్టి హెలికాప్టర్ రైడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకుల కోసం టిక్కెట్ ధర రెండు వేలుగా నిర్ణయించారు. ఈనెల 22వ తేదీ నుంచి స్థానిక వంశధార హైస్కూల్‌లో టిక్కెట్ల విక్రయాలు ప్రారంభం కానున్నాయి. రోజుకు గరిష్టంగా 40 ట్రిప్పులు మాత్రమే ఉండటం వల్ల 240 మందికి అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా రోజుకు 250 టిక్కెట్లు విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

భారీ బందోబస్తు

మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. సుమారు 800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఎవరైనా ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా 9440795835, 08942 238633 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఉత్సవాలకు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

సుగాలి ప్రీతి కేసుపై సమగ్ర విచారణ చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.పావని

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సుగాలి ప్రీతి కేసుపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.పావని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తాను పెట్టబోయే మొదటి సంతకం సుగాలి ప్రీతి కేసు విచారణపై అని చెప్పారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక ఆ కేసు విషయాన్ని మర్చిపోయారని విమర్శించారు. వెంటనే కేసు విచారణ చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యార్థినులపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో శానిటరీ పాడ్స్ విద్యార్థినులకు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి చాలామంది విద్యార్థులకి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. పాఠ్య పుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతం, భగత్‌సింగ్ జీవిత చరిత్ర, ప్రజాస్వామ్యం ఆవశ్యకత లాంటి సిలబస్‌లను తీసి గాంధీని హత్య చేసిన గాడ్సే, మతోన్మాద శక్తులతో ఉన్నటువంటి అంశాల్ని పెట్టడం సరికాదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా పి.దివ్య, కో కన్వీనర్‌గా నందినిలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.పవిత్ర, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రారంభమైన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న బాలికలు, పురుషుల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కబడ్డీ పోటీలను జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు వై.వెంకన్నచౌదరి, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని కబడ్డీ పోటీలను ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. తొలుత బాలికల కబడ్డీ పోటీలు ప్రకాశం, నెల్లూరు జట్ల మధ్య, అనంతపురం, విజయనగరం జట్ల మధ్య పురుషుల కబడ్డీ పోటీలు ఉల్లాసంగా సాగాయి. రాష్ట్రస్థాయిలో 12 జిల్లాల బాలికల కబడ్డీ జట్లు, 21 పురుషుల జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని అన్నారు. ఏటా కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో సంప్రదాయ, గ్రామీణ క్రీడలు నిర్వహించడం క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటమిలను సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తిని, స్నేహభావాన్ని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, జెడ్‌పి సిఇఒ ఎల్.వి.ఎస్.శ్రీధం రాజా, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్, నెహ్రూ యువజన సహాయ సంచాలకులు వెంకట్ ఉజ్వల్, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చిరంజీవరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, బోయిన రమేష్, డిఎస్‌పి లక్ష్మణరావు, జిల్లా కబడ్డీ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఆర్.అప్పలస్వామి పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న బాలికలు

మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

థర్మల్ ప్లాంట్‌ను అడ్డుకుని తీరుతాం

- గిరిజనుల పోరాటానికి సంపూర్ణ మద్దతు
- భూములు, బూడిద కోసమే ఎమ్మెల్యే కూన ఆరాటం
- వైసిపి ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో ఏర్పాటు చేయ తలపెట్టిన థర్మల్ పవర్ ప్లాంట్‌ను అడ్డుకుని తీరుతామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. థర్మల్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న గిరిజనులకు వైసిపి అండగా ఉంటుందని, వారి పోరాటంలో భాగస్వామ్యమవుతుందని తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాలకు చేటు చేసే థర్మల్ ప్లాంట్లను 2030 నాటికి 50 శాతం, 2050 నాటికి పూర్తిస్థాయిలో మూసివేయాలని ప్రపంచ దేశాలు తీర్మానం చేశాయని చెప్పారు. ఈ తరుణంలో ఈ ప్రాంతంలో రూ.30 వేల కోట్లతో థర్మల్ ప్లాంట్‌ను నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. థర్మల్ ప్లాంట్ నిర్మాణం వల్ల ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, ఎల్ఎన్‌పేట, హిరమండలం, శ్రీకాకుళం రూరల్, సీతంపేట, పాలకొండ, సంతకవిటి మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. గతంలో పలు ప్రాంతాల్లో జెన్‌కో పేరుతో ఇలాగే భూములు సేకరించి విశాఖపట్నంలో హిందూజా కంపెనీకి, రాజమండ్రి వద్ద జి.వి.కె కంపెనీకి కారుచౌకగా భూములు కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వెన్నెలవలస థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో భూములు, ప్లాంట్ నుంచి వచ్చే బూడిదని కాజేయడానికి ఎమ్మెల్యేతో పాటు స్థానిక టిడిపి నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్లాంట్ నుంచి వచ్చే బూడిదతో సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని చెప్పారు. థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాలుగు టిఎంసిల నీరు అవసరమని, అదే నాలుగు టిఎంసిఎల నీటితో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయొచ్చన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ఆలోచనను ప్రభుత్వం విడనాడకపోతే ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, నాయకులు దుంపల శ్యామలరావు, ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం లక్ష్యం

ఎన్ఎఫ్‌పిఇ రాష్ట్ర కన్వీనర్ బి.శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎన్ఎఫ్‌పిఇ రాష్ట్ర కన్వీనర్ బి.శ్రీధర్‌బాబు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శ్రీకాకుళం డివిజన్ 12వ ద్వైవార్షిక మహాసభను ఆదివారం నిర్వహించారు. గ్రూప్-సి అధ్యక్షులు యు.వి.రమణ, పోస్టుమెన్ అండ్ ఎం.టి.ఎస్ అధ్యక్షులు టి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన మహాసభను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తపాలా శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలు అవసరమన్నారు. పోస్టుమెన్ అండ్ ఎం.టి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.మురళి మాట్లాడుతూ 8వ వేతన సంఘం నియమించడం లేదని విమర్శించారు. కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్పు చేసి సంఘాలను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కె.శ్రీనివాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని, ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సి అధ్యక్ష, కార్యదర్శులుగా యు.వి రమణ, కె.గణపతి, కోశాధికారిగా వి.ఢిల్లేశ్వరరావు, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమేన్ అండ్ ఎం.టి.ఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు, ఎల్.బాబూరావు, కోశాధికారిగా ఎం.చిన్నారావు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గ సభ్యులతో శ్రీధర్‌బాబు

ప్రకృతి వ్యవసాయం విస్తృతం

- యాజమాన్య ఖర్చులు తగ్గించడం లక్ష్యం
- జిల్లాలో 48 వేల ఎకరాల్లో సాగు
- లక్ష ఎకరాలు సాగు లక్ష్యంగా ముందుకు
- జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రస్తుత రోజుల్లో రైతులకు వ్యవసాయం అంటే చాలా భారంగా మారిందని జిల్లా ప్రకతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. ప్రకృతి వ్యవసాయానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించుకుంటూ రైతులు ముందుకు సాగేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పంటల పెట్టుబడును క్రమేపీ తగ్గించుకుంటూ పంటల దిగుబడి వచ్చేలా చేసుకోవడానికి 'ప్రకతి వ్యవసాయం' రైతుకు ఒక సులువైన మార్గంగా చెప్పారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు విషయాలు వెల్లడించారు.

? ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రయోజనం ఏమిటి?

ప్రకృతి వ్యవసాయంలో రైతులు బయట నుంచి కొని తెచ్చే ఏ విధమైన ఎరువులు కూడా అవసరం ఉండదు. కేవలం తమ వద్ద ఉన్న దేశవాళి ఆవులతో సులువుగా ప్రకతి వ్య వసాయాన్ని సాగు చేసుకోవచ్చు. ఆవు గోమయ, గోమూత్రాల ద్వారా తయారు చేసిన జీవామృతం, ఘనజీవామృతాలను పంటల్లో ఉపయోగించుకుంటే నేల సారవంతంగా మారుతుంది. ఆరోగ్యకరమైన పంటలు రైతులకు లభిస్తాయి. పంటలపై చీడపీడల ప్రభావం ఉన్నట్లయితే ఎటువంటి పురుగు మందులూ కొనుగోలు చేయకుండా మన గ్రామాల్లో దొరికే సహజ వనరులతో పలు రకాల కషాయాలను రైతులు సొంతంగానే తయారు చేసుకుంటే ఏవిధమైన ఖర్చు లేకుండా సమర్థవంతంగా పంటలు సాగుచేయవచ్చు.

? అమలు తీరు ఎలా ఉంది?

పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా పనిచేస్తున్నాం. జిల్లాలో ప్రస్తుతం 48 వేల ఎకరాల్లో 58 వేల మంది ఈ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు. లక్ష ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. 1.50 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. తాతలు కాలంలో ఈ వ్యవసాయం సాగేది. ప్రస్తుతం మళ్లీ ఈ పద్ధతులు అమలు చేస్తేనే రైతులకు సాగు యాజమాన్యపు ఖర్చులు తగ్గుతాయి.

? సాగు విస్తీర్ణం పెంచే వ్యూహం ఏమిటి?

రైతులు చేస్తున్న రసాయన వ్యవసాయాన్ని పూర్తిగా ప్రకతి వ్యవసాయంలోనికి మార్చడానికి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది కృషి చేస్తున్నారు. రైతులకు ప్రతినిత్యం అందు బాటులో ఉండి ఈ ప్రకతి వ్యవసాయ పద్ధతులను రైతులతో నేరుగా వాళ్ల క్షేత్రాల వద్దకు వెళ్లి చేయిస్తున్నాం. గ్రామాల్లో బయో రిసోర్స్ సెంటర్స్ ఏర్పాటు చేయించడం, వాటిలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది తరచూ ప్రతి సీజన్‌కూ రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన కషాయాలు, ద్రావణాలను తయారు చేయించి నిల్వ ఉంచడం, వాటిని పంటల్లో వచ్చే పురుగులు తెగుళ్లను రైతుల ద్వారా గుర్తించి వాటిని రైతులకు సరఫరా చేయిస్తున్నాం.

? జిల్లాలో ఏ ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు?

జిల్లాలోని శ్రీకాకుళం, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, పలాస, నందిగాం, సోంపేట, ఇచ్ఛాపురం, రణస్థలం మండలాల్లోని గ్రామాల్లో క్లస్టర్లుగా విభజించి సాగుకు ప్రోత్సహిస్తున్నాం. గ్రామాల్లో ప్రకతి వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతులకు ఈ ప్రకతి వ్యవసాయ సాగు పద్ధతులను తెలియజేస్తూ ముందుకు సాగుతున్నాం. జిల్లా మొత్తం విస్తరించే కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం.

పనులను పరిశీలిస్తున్న వెంకన్న చౌదరి

ఫ్లైఓవర్ వంతెన పనులు పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల ప్రజలతో పాటు ఉద్దాన గ్రామల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రైల్వే వంతెన పనులను టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి టిడిపి నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంతెన పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని తెలిపారు. 2026 మార్చి నాటికి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలనే దఢ సంకల్పంతో ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, కొరికాన శంకర్, చిన్ని దువ్వాడ శ్రీకాంత్, చంద్రశేఖర్యాడీ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న కృష్ణదాస్

అరవింద్‌కు సన్మానం

ప్రజాశక్తి- నరసన్నపేట

వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా కనపల అరవింద్ నాయుడు ఇటీవల నియమితులయ్యారు. దీంతో ఆయనను వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తన క్యాంప్ కార్యాలయంలో దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవికుమార్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ సురంగి నర్సింగరావు, జిల్లా పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ బోర నర్సునాయుడు, జిల్లా పార్టీ యువజన విభాగం కార్యదర్శి పాగోటి గోవిందరావు, మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, కార్యదర్శులు మార్పు శేఖర్, పొట్నూరు పృథ్వీరాజ్, సర్పంచ్‌లు అల్లు అసిరినాయుడు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు దాము మన్మథరావు, మాజీ సర్పంచ్ ముకళ్ల సత్యం, కనపల సుధాకర్, శేఖర్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

20 మంది రక్తదానం

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి యువజన సేవా సంఘం స్థాపనకు పదేళ్ల పూర్తయిన సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 20 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకట ఉజ్వల్, శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కాంతారావు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ మౌనం ఎందుకో?

ప్రజాశక్తి- పలాస

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై లోక్‌సభ కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సాక్ష్యాధారాలతో దొంగ ఓట్లపై ఆరోపణలు చేస్తున్నా ఎన్నికల కమిషనర్ మౌనం వెనుక ఆంతర్యం ఏమిటని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్‌పై కేసు పెట్టినా కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. 2023 డిసెంబరులో బిజెపి ఆమోదించిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల బిల్లు, 2023లోని క్లాజ్-16 ప్రకారం, ఎన్నికల కమిషనర్లు తమ పదవీ కాలంలో చేసిన ఏదైనా సివిల్, క్రిమినల్ నేరానికి వారు చనిపోయే వరకు కూడా ఎటువంటి కోర్టులోనూ కేసు వేయలేరన్నారు. వారికి దేశంలోని అన్ని చట్టాల నుంచి మినహాయింపు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ రకమైన రక్షణ భారత రాష్ట్రపతికీ లేదని అన్నారు.

మెడికల్ కాలేజీలతో వ్యాపారమా?

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

భారతీ దివ్య

వైసిపి ప్రభుత్వం హయాంలో నిర్మించిన 17 కొత్త మెడికల్ కాలేజీలతో కూటమి ప్రభుత్వం వ్యాపారంగా మార్చే ప్రయత్నం చేయడం దారుణమని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు భారతీ దివ్య ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతి జిల్లాలోనూ మెడికల్ కాలేజీ ఉండాలన్న కలను వైసిపి నిజం చేసిందన్నారు. ఈ కాలేజీల వల్ల వేలాది మంది విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు లభించగా, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైసిపి పభుత్వం వేసిన బాటలో వచ్చినా, వాటిని తాము చేసిన పనుల్లా ప్రైవేటైజేషన్ వైపు మళ్లిస్తూ... ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక బిసి బాలికల పోస్టుమెట్రిక్ వసతిగృహంలో ఆదివారం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్ఎ జిఎస్ ఆధ్వర్యాన విశ్రాంత రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.అరవింద్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థికీ హెల్త్ కార్డు తయారు చేసి విద్యార్థినులకు అవసరమైన ప్రత్యేక సామగ్రిని అందించారు. వసతిగృహ మ్యాట్రిన్ టి.టి.శ్రావణి కుమారి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరంలో జెమ్స్ కళాశాల నుంచి పిజి వైద్య విద్యర్థులు 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఘనంగా గురజాడ జయంతి

శ్రీకాకుళం సిటీ : ప్రభాత్ భేరి నిర్వహిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దేశంలో ప్రస్తుతం నెలకొన్న విద్వేషపూరిత వాతావరణంలో అన్ని మతాలు, కులాల మధ్య ఐక్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఇందుకు గురజాడ దేశభక్తి గీతం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. మహాకవి గురజాడ 163వ జయంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో ఆదివారం దేశభక్తి గీతాన్ని పాడుతూ ప్రభాత్ భేరి నిర్వహించారు. డే అండ్ నైట్ జంక్షన్ దగ్గర ప్రారంభమైన ర్యాలీ ఆర్‌టిసి కాంప్లెక్స్, అంబేద్కర్ జంక్షన్, కోడి రామ్మూర్తి స్టేడియం మీదుగా ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ వరకు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి, సామరస్యానికి, సమతుల్యమైన సామాజిక అభ్యుదయానికి బాటలు వేసిన నవయుగ వైతాళికుడు మహాకవి గురజాడ అని కొనియాడారు. తెలుగువారు గర్వించదగ్గ ఈ గొప్ప కవిని జయంతిని పాలకుల విస్మరించడం శోచనీయమన్నారు. గురజాడ ఆశయాలకు భిన్నంగా నేడు ఓటు హక్కు పైనే దాడి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చింతాడ రామచంద్రరావు దేశభక్తి గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు గొంటి గిరిధర్, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.పవిత్ర, బాడాన శ్యామలరావు, కంచరాన భుజంగరావు, డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో గురజాడకు నివాళ్లర్పించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర నాయకులు డి. సూర్యుడమ్మ, ఎం.లక్ష్మి, కె.లావణ్య పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా దేశాన్ని ప్రేమించడమే నిజమైన దేశభక్తి అని అన్నారు. ఆధునిక స్త్రీ చరిత్రని పునర్లిఖిస్తుందని, వందేళ్ల క్రితమే చెప్పగలిగిన మేధావి గురజాడ అన్నారు. కార్యక్రమంలో కె.రాములమ్మ, సుధ, లక్ష్మి, రమణమ్మ, ఢిల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : గురజాడ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఐద్వా నాయకులు

గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో గురజాడ అప్పారావు విగ్రహానికి ఇంటెక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాధనాయుడు, సీనియర్ సభ్యులు కొమ్ము రమణమూర్తి పుష్పాభిషేకం చేసి నివాళ్లర్పించారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ ఆధ్వర్యాన గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాడ సాహిత్యంతో సంఘ సంస్కరణలో నెలకొల్పి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. ముందుగా అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసే నివాళ్లర్పించారు. విద్యార్థులు, సూరమ్మ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : తెలుగు రచయిత, సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ, నలంద పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు మురళి, హేమలత, మణి, వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పుస్తకం పిలుస్తుంది రా అంటూ ప్రయోగాత్మకంగా విద్యార్థులతో నిర్వహించారు. పిల్లలకు ఇతర పుస్తకాలు చదివే అలవాటు పోయి సెల్ ప్రపంచంలో మునిగిపోవడంతో గ్రంథాలయంలో ఒక పుస్తకం చదివితే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటారని అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి మురపాక శ్రీని వాసరావు తెలిపారు. నీతి కథల పుస్తకాలను అందుబాటులో ఉంచి వారితో చదివిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శిగా వెంకట సత్యం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని వైకుంఠపురం పంచాయతీ సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సత్యం వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. తనను జాయింట్ సెక్రటరీగా నియమించిన మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, నియోజకవర్గ సమన్వయకర్త చెంతాడ రవికుమార్, బూర్జ మండల వైసిపి అధ్యక్షులు ఖండాపు గోవిందరావులకు కృతజ్ఞతలు తెలిపారు. జాయింట్ సెక్రెటరీగా నియమితులైన వెంకట సత్యంను వైసిపి నాయకులు అభినందించారు.

ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలోశ్రీతీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999 - 2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సభలో కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. పాత జ్ఞాపకలను గుర్తు చేసుకున్నారు. విద్యబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు కె.అప్పారావు, పిన్నింటి సూర్యనారాయణ, ఎన్.వి.వి.జోగారావు, లక్ష్మణరావు, ధర్మారావు, వాణి తదితరులను దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు.

యూరియా పంపిణీలో విఫలం

ఉషారాణి

వజ్రపుకొత్తూరు: ఖరీఫ్ రైతులకు యూరియా పంపిణీలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి మండల మహిళా విభాగం అధ్యక్షులు జల్లు ఉషారాణి అన్నారు. ఆమె పూండిలో ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతు సేవాల కేంద్రాల్లో నిల్వ ఉంచాల్సిన యూరియా సీజన్ దాటిపోయినా అందికపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల్లో గత వైసిపి ప్రభుత్వం ఎంత కావాలంటే అంత సరఫరా చేయడంతో పాటు ప్రైవేటు ఏజన్సీల్లో సైతం అందు బాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించడంలో సైతం ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు అక్షేపనీయమన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం సిటీ: అరసవల్లి శ్రీసూర్య నారాయణ స్వామిని ఆదివారం ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రసాద్ స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

రూ.23 వేలు వితరణ

శ్రీకాకుళం సిటీ: మోనిష అనే చిన్నారి గెండె జబ్బుతో ఇబ్బంది పడుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ చిన్నారి పరిస్థితి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఎచ్చెర్ల మండలం మన కుటుంబం వాట్సాప్ గ్రూపు అడ్మిన్ కొత్తకోట శ్రీనివాసరావు స్పందించి గ్రూప్‌లో పోస్టు పెట్టి రూ.23 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని విశాఖపట్నం వెంకోజీ పాలెంలో ఉన్న చిన్నారి కుటుంబానికి ఆదివారం ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ చౌదరి అప్పారావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సంపతరావు, విద్యాసాగర్ అందజేశారు.

చలో విశాఖ డెయిరీ విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాల రైతుల సంఘం నాయకులు, రైతులు

శ్రీకాకుళం: చలో విశాఖ డెయిరీ విజయవంతం చేయాలని పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, కౌలు రైతుల సంఘం కార్యదర్శి పాలాకి ప్రసాదరావు, వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు గుండు రఘురాం పాల రైతులకు పిలుపునిచ్చారు. గార మండలం అంపోలు గ్రామ పాల రైతులతో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని, విశాఖ డెయిరీ ఆస్తులను కాపాడాలని, పాల రైతులకు పాల సేకరణ ధర రూ.పది పెంచాలని, ప్రతిమూడు నెలలకు బోనస్ ఇవ్వాలని, మరణించిన రైతు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, పశువులకు ఉచిత భీమా, మందులు, గడ్డి విత్తనాలు, పశువుల దాణా 75శాతం రాయితీ ఇవ్వాలన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ విచారణ నుంచి తప్పించుకునేందుకు బిజెపిలో చేరి విచారణ విధించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు రిపోర్ట్ ఇవ్వడం లేదని, విశాఖ డెయిరీ సహకార రంగంలోకి తీసుకురావాలని, హౌస్ కమిటీ విచారణ వేగవంతం చేసి పాల రైతులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల రైతులు పాల్గొన్నారు.

ముందస్తు దసరా ఉత్సవాలు

ఇచ్ఛాపురం: స్థానిక శ్రీసత్యసాయి విద్యా సంస్థలో ముందుస్తు దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో విద్యార్థులు బాల త్రిపుర సుందరి, గాయత్రి, ధనలక్ష్మి, రాజరాజేశ్వరి, అన్నపూర్ణ, సరస్వతి, లలిత, దుర్గ, మహి సాసుర మర్ధిని, రూపాయల్లో వచ్చి ప్రదర్శన చేశారు. దేవి ప్రాముఖ్యతను, విశిష్టతను స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ భానుతేజ విద్యార్థులకు తెలియజేశారు. వివిధ రూపాల్లో ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాల్లో కరస్పాండెంట్ లక్ష్మి, ప్రిన్సిపల్ వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సోంపేట : దసరా ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులు

సోంపేట : మండలంలోని కొర్రాయిపేట ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. గ్రామీణ వాతావరణం, సాంప్రదాయాలను గుర్తుకు తెచ్చేలా విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. చేతిలో కాగితపు బాణాలు పట్టుకొని దసరా పాటలను పాడుతూ విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాటలు హాస్యాస్పదం

కొత్తూరు: ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇటీవల అసెంబ్లీలో మాట్లాడుతూ వంశధార రిజర్వాయరు నుంచి జిల్లాలో శివారు గ్రామాల వరకూ ప్రతి సెంటుకూ సాగునీరు అందిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పిఎసిఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మెట్టూరులో విలేకరులతో మాట్లాడారు. వంశధార ఫేజ్-2లో భాగంగా కొత్తూరు, హిరమండలం మండలం పాడలి, దుగ్గుపురం, తులగాం, ఇరపాడు, గులివిందలపేట, మెట్టూరు, మెట్టూరుగూడ, కారిగూడ, లబ్బ అడవికొత్తూరు, కృష్ణాపురం, ఇరపాడుగూడ, గూనభద్ర, పారాపురం నిర్వాసితులు తక్కువ ధరకు భూములను ప్రభుత్వానికి ఇచ్చి సర్వం కోల్పోయారని అన్నారు. 14 గ్రామాల ప్రజలు ఇంకా తమకు ఉన్న మిగులు భూములకు నీరు అందక కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండించుకుంటున్నారని అన్నారు. పంటలకు సాగునీరు లేక, సక్రమంగా పండక దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారని అన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే పారాపురం దగ్గర ఉన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయరు వద్ద ఎత్తిపోతల పథకం ప్రారంభించాలని కోరారు. దీని ద్వారా సుమారు 2500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సమావేశంలో ఆర్అండ్ఆర్ గూనభద్ర సర్పంచ్ పెద్దకోట సాధుబాబు, వైసిపి మండల ఎస్‌సి సెల్ మాజీ అధ్యక్షులు మురపాక శంకరరావు, మండల మాజీ కార్యదర్శి ఎస్.వరహాలింగం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యనారాయణ

మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

స్థానిక ఎన్నికలకు ఇప్పట్నుంచే సిద్ధం

టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి

పలాస: స్థానిక సంస్థల ఎన్నికల్లో గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మున్సిపాలిటీ వార్డు సభ్యులు గెలుపొందేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని టిడిపి నియోజకవర్గం సమన్వకర్త యార్లగడ్డ వెంకన్నచౌదిరి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్లు. యూనిట్ కన్వీనర్లు, కో కన్వీనర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారని, దీంతో ప్రజలంతా కూటమి ప్రభుత్వం వైపే ఉన్నారన్నది స్పష్టమవుతోందని అన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు మహిళలు పూర్తిస్థాయి నమ్మకంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ ఇఒపై ఆర్‌డిఒ ఆగ్రహం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఉత్సవాలు సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణపై ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్కలి డిఎస్‌పి లక్ష్మణరావుతో కలిసి ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చెత్తా చెదారం కనిపించడంతో ఇఒపై ఆగ్రహం వ్యక్తం చేచేశారు. పారిశుధ్య కార్మికులు అందుబాటులో ఉంచి నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని పలుమార్లు చెప్పినా పట్టించుకోకుండా ఏదో సమాధానం చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే టెక్కలి డిఎల్‌పిఒను పిలిపించి పది మంది కార్మికులను నిత్యం ఆలయ పరిసర ప్రాంతాల్లో శుభ్రపరుస్తూ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం క్యూలైన్లు, క్రీడా మైదానం, వాహన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈయనతో సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ. వి.సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడైన రహదారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని రహదారులు పాడయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. ప్రధాన రోడ్లు గోతులమయంగా మారాయి. కుశాలపురం, బైపాస్ రోడ్డు నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ఉన్న రోడ్డు పాడైయింది. రోడ్డుపై తారు పొర ఊడి పోయింది. కొన్నిచోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికీ గోతుల్లో నీళ్ళు ఉన్నాయి. సింహద్వారం నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు ఉన్న రోడ్డు పాడైపోయి రోడ్డుపై తారుపొర ఊడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే డే అండ్ నైట్ కూడలి నుంచి రామలక్ష్మణ జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు సైతం పాడైపోయింది. నగరపాలక సంస్థ అధికారులు రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదు. నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటాపురం రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారింది. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కిమ్స్ ఆస్పత్రి సమీపంలో రోడ్డు పరిస్థితి

పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో రోడ్డుపై గోతులు

గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- లావేరు

మృతి చెందిన వెంకట రమణ

మండలంలోని పాత కుంకాం గ్రామానికి చెందిన శెటికం వెంకటరమణ (54) గడ్డి మందు తాగి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు వెంకటరమణ విజయ వాడలో ఉంటూ ఇటీవల తనగ్రామానికి వచ్చాడు. భార్యకు ఈయనకు విబేధాలు రావడంతో కాపురానికి భార్య రాకపోవడంతో మనస్థాపం చెంది శనివారం సాయంత్రం ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగేయడంతో కుటుంబీకులు గ్రహించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈయనకు భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి ఇప్పటికే వివాహాలు అయ్యాయి. ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన గొర్రెలు, మేకలు

పిడుగుపాటుకు గొర్రెలు, మేకలు మృతి

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని డోలగోవిందపురం సమీపంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడిన ఘటనలో రెండు గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. బెల్లుపడకు చెందిన గుర్రు రామారావు అనే పాడి రైతు పశువులను మేతకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో పశువుల మందకు సమీపంలో పిడుగు పడింది. పిడుగు పాటు ప్రభావంతో గొర్రెలు, మేకలు మృతి చెందినట్లు రైతు తెలిపారు. నిరుపేదైన రామారావును ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రైతుల లక్ష్మీనారాయణ, గ్రామస్తులు కోరుతున్నారు.

నిందితులను అరెస్టు చేసిన సిఐ సూర్యనారాయణ

83 కిలోల గంజాయి స్వాధీనం

మూడు కేసుల్లో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు వేర్వేరు కేసుల్లో 83 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకొని ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి కేసులో రాయఘడ జిల్లాకు గొబిబందకు చెందిన బిసియా గంటా, సరిగిగూడకు చెందిన స్వప్నబిహార్‌లు గుణుపూర్ నుంచి పలాస రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా 40 కిలోల గంజాయితో పట్టుబడ్డారని అన్నారు. రెండో కేసులో ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి బస్సులో తీసుకువచ్చి పలాస రైల్వేస్టేషన్‌కు 28 కిలోల గంజాయి తరలిస్తుండగా, తమిళనాడు ప్రాంతానికి చెందిన గాయత్రి అనీఫ్, ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన మమతాకుమారిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 28 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మూడో కేసులో 15 కిలోల గంజాయిని పర్లాకిమిడి నుంచి పలాస వరకు బస్సులో వచ్చి రైల్వేస్టేషన్ వైపు అక్రమంగా రవాణా చేస్తుండగా గజపతి జిల్లా కంటసారుకు చెందిన లలిత మజీను అరెస్టు చేసి ఆమె నుంచి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు సిఐ తెలిపారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

రాపాకలో వైద్యశిబిరం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం శిశిధర్ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 150 మందికి బిపి, షుగర్, పలు రకాల రక్త పరీక్షలను ఉచితంగా జరిపి మందులను అందజేశారు. కార్యక్రమంలో డా.చిన్నంనాయుడు, కూటమి నాయకులు బలగ శంకరభాస్కరరావు, కొంచాడ గొల్లయ్య, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది మౌనిక, లక్ష్మీ, మంగ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

ఏ రంగంలో ప్రతిభ కనబరిచినా వారికి ప్రోత్సాహం తప్పనిసరని సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండవ రామారావు అన్నారు. మండలంలోని చిన్నమెళియపుట్టుగకు చెందిన మొగిలిపురి బాలకృష్ణ కుమార్తె మొగిలిపురి శృతి క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తోంది. గత నెల చీరాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించిన శృతి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని కవిటి మండల చింతామణి సొండిల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం ఘన సన్మానం చేశారు. శృతికి జ్ఞాపిక, ప్రశంస పత్రాన్ని అందజేస్తూ దుశ్శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు మొగిలిపురి నాగేశ్వరరావు, సభ్యులు పి. శేఖర్, ఎం.రామకృష్ణ, ఎం.ఢిల్లేశ్వరరావు, కె.ప్రశాంత్, మహేష్, సుధ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సభ్యులు

బెల్టుషాపులకు మద్యం డోర్ డెలివరీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో మద్యం ఏరులై పారుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో సైతం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మండల ప్రజలు బహిరంగంగానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై అల్లెన గ్రామంలో ఉన్న బెల్టు షాపులకు ఆర్డర్‌పై మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులను లేకుండా చేస్తామని, మద్యం విక్రయాలను అరికడతామని ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాలతో పాటు గిరిజన గ్రామాల్లో కూడా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయి గాని మద్యానికి కోదవులేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లెనలో మద్యం డెలివరీ చేస్తున్న మద్యం షాపు సిబ్బంది

అవినీతి నిర్మూలనతోనే దేశ ప్రగతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అవినీతి నిర్మూలనతోనే దేశ ప్రగతి సాధ్యంగా గ్రామీణ బ్యాంకు శ్రీకాకుళం రీజినల్ మేనేజర్ లావేటి అనంతరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా వాక్‌థన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అవినీతికి తావ లేకుండా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. బ్యాంకు సేవలు, ఆర్థిక అక్షరాస్యత ద్వారా సైతం పేదరిక నిర్మూలన సాధ్యంగా వివరించారు. గ్రామీణ ప్రాంతాల ప్రగతికి గ్రామీణ బ్యాంకులు కృషి చేస్తున్నాయన్నారు.

రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ ఆపరేషన్స్ నందిని సాహు, సీనియర్ బిజినెస్ అధికారి భాస్కర్ ప్రసాద్, శ్రీకాకుళం మెయిన్ బ్రాంచ్ మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎఎస్‌ఐ రమణమూర్తి

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

పొందూరు: శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని ఎఎస్ఐ డి.రమణమూర్తి అన్నారు. మండలం లోలుగు కాలనీలోని ఉపహార్ స్వచ్ఛంద సంస్థలో ఆదివారం జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఆమదాలవలస శక్తి-2 ఆధ్వర్యంలో శక్తియాప్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ప్రతి మహిళ తప్పనిసరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో ఈ యాప్ ద్వారా ఎలా రక్షణ పొందవచ్చునో వివరించారు. అలాగే పోక్సోచట్టం, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణాతో పాటు పలు టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తిటీం సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని మాణిక్యపురం 11కెవి, 11కెవి ఆర్‌డబ్ల్యుఎస్ ఫీడర్లలో ఆర్‌డిఎస్‌ఎస్ పనులు నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొరివంక సబ్ స్టేషన్ పరిధిలోని బొరివంక, బొగిడియాపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగానపుట్టుగ, కొర్రాయిపుట్టుగ గ్రామాలకు, మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక, కుసుంపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నరసన్నపేట : మండలంలోని ఉర్లాం విద్యుత్ ఉప కేంద్రం 33/11 కెవిలో మరమ్మతులు దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎఇ నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని పరిధిలోని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

ఎస్‌జిఎఫ్ ఆర్థికసాయం

కవిటి: స్పెషల్ గైస్ ఫౌండేషన్ మరోసారి తన ఔదార్యం చాటుకుంది. వీరఘట్టం ప్రాంతానికి చెందిన గెంబలి గణేష్ (టెక్నీషియన్) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తలకు గాయం కావడంతో విశాఖపట్నం జెఒఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు శస్త్రచికిత్స కోసం సుమారు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్‌సభ్యులు నిరుపేద కుటుంబానికి చెందిన గణేష్‌కు సంస్థ తరపున తక్షణ సహాయంగా రూ.8 వేలు అందజేశారు. అయితే చికిత్స ఖర్చులకు ఇంకా భారీ మొత్తం అవసరమవుతుండడంతో గణేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని సభ్యులు కోరారు. దాతలు స్పందించి ఫోన్ పే నంబరుకు 9502381265 ఆర్థికసాయం అందించాలని కోరారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి

శాంతి పరిరక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రపంచ శాంతి పరిరక్షణకు సమాజంలో ప్రతిఒక్కరూ కృషి చేయాలని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. ప్రపంచం శాంతి దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతియుత పరిస్థితులను పెంపొందించే లక్ష్యంతో ప్రతిఏటా సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవంగా నిర్వహిస్తారన్నారు. శాంతి మార్గం ద్వారానే దేశ ప్రగతి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర శాఖ సభ్యులు ఎం.మల్లేశ్వరరావు, ఇస్కఫ్ జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి, గేదెల ఇందిరా ప్రసాద్, స్టార్‌వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, స్టార్ మహిళా క్లబ్ ప్రతినిధి గేదెల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

ప్రజాశక్తి- టెక్కలి

సమగ్ర శిక్షా అభియాన్‌లో సెక్టోరియల్ అధికారుల నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. ఆదివారం డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం టెక్కలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన అసిస్టెంట్ గర్ల్‌చైల్డ్ అభివృద్ధి అధికారిని నియామకంలో నిబంధనలు పాటించకుండా డెప్యుటేషన్ ప్రాతిపదికన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మహిళా ఉపాధ్యాయురాలిని నియమించడాన్ని తప్పుపట్టారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి, రాత పరీక్ష నిర్వహించి, ఇంటర్వ్యూ ద్వారా నియామకం చేయాలన్నారు.

అలా కాకుండా రాజకీయ సిఫార్సుల మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అడ్డదారిన నియామకం చేయడం సమంజసం కాదని అన్నారు. వెంటనే అక్రమ డెప్యుటేషన్‌ను రద్దుచేసి సెక్టోరియల్ అధికారుల ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్, జి.బాల కృష్ణ, ఆమదాలవలస మండల డిటిఎఫ్ సంఘ నాయకులు గణేష్ పాల్గొన్నారు.

సిసి కెమెరాల నిఘాలో ఉత్సవాలు

కోటబొమ్మాళి: మంగళవారం నుంచి నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలు సిసి కెమెరాల నిఘాలో భారీ బందోబస్తు మధ్య నిర్వహిస్తామని టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొనున్న నేపథ్యంలో 800 మంది పోలీసులు, 40 ఎస్ఐలు, 15 సిఐలు, నలుగురు డిఎస్‌పిలు, ఆరు మొబైల్ టీమ్‌లతో కూడిన భారీ బందోబస్తు మధ్య ఎక్కడా ఎలాంటి

విలేకరులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికులు వారికి కేటాయించిన పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామంలోని వాహనదారులు కూడా ఈ మూడు రోజులు మెయిన్ రోడ్డుపై తిరగనివ్వబోమని, దీనికి ప్రజలు, యాత్రికులు తమకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

డాబాపై నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో శ్రీజగన్నాథపురానికి చెందిన మహిళ డాబా పైనుంచి జారిపడి ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీజగన్నాథపురానికి చెందిన కొమర ఎర్రమ్మ (46) భర్త రామారావు కలిసి గత 20 ఏళ్లగా నివాసం ఉంటుంది. శనివారం రాత్రి వ్యక్తి పనుల నిమిత్తం డాబా ఎక్కింది. రాత్రి కావడంతో డాబా పైనుంచి కాలుజారి కిందకు పడిపోవడంతో తలకు, కడుపు, శరీర భాగాలపై గాయలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనాస్థలాన్ని ఆదివారం పోలీసుల పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నిబద్ధతతో పనిచేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రతి టిడిపి కార్యకర్తా నిబ్ధతతో పనిచేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఎ కాలనీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మండలంలోని 12 పంచాయతీలోని కార్యకర్తలతో, లీడర్ విత్ కేడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ మండల అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, చిట్టి మోహనరావు పాల్గొన్నారు.

కంప్యూటర్లను పరిశీలిస్తున్న శంకరరావు

శాఖాగ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక శాఖాగ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి వి.వి.జి.శంకరరావు ఆదివారం తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ ఫౌండేషన్ సౌజన్యంతో రెండు కంప్యూటర్లు, ఒక టివి అందజేశారని అన్నారు. వీటితో చిన్నారులు ఆటలు, పాటలు, కథలతో అవసరమైన శిక్షణ పొందవచ్చునన్నారు. కంప్యూటర్లపై ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. నెట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా వినియోగించినట్లయితే మరిన్ని కంప్యూటర్స్ అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈయన వెంట గ్రంథాలయాధికారి టి.ఇందిర, సిబ్బంది డి.లక్ష్మి ఉన్నారు.

అధ్వానంగా రోడ్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. తొగరాం పంచాయతీ దిబ్బలపేట, ఇసకలపేట గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. 2019 ఎన్నికల ముందు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ రెండు గ్రామాల ముఖద్వారం వద్ద శిలాఫలకాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2024 ఎన్నికల ముందు శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖద్వారం వద్ద మరొక శిలాఫకాన్ని ఆవిష్కరించారు. కానీ, తారు రోడ్డుకు మోక్షం కలగలేదు.

డ్రోన్‌తో జిల్లేడు ద్రావణం పిచికారీ

డ్రోన్‌లో జిల్లేడు ద్రావణం పోస్తున్న రైతులు

నరసన్నపేట : మండలంలోని దేవాదిలో గొరవల్లి రఘునాథరావు ప్రకృతి వ్యవసాయ రైతు వరి పొలంలో ఆదివారం 15 ఎకరాలు జిల్లేడు ద్రావణం డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేశారు. జిల్లేడు ద్రావణం డ్రోన్‌తో పిచికారి చేయడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పిచికారీ చేయడం వల్ల వరి పంటలో రసం పీల్చే పురుగుల నివారిస్తాయని తెలిపారు. అలాగే పంట గ్రోత్ పెరిగి, చేను నల్లగామారి, గింజ నాణ్యత పెరిగి మొక్కకి నత్రజని, భాస్వరం పొటాషియం అందిస్తుందని తెలిపారు. రసాయన ఎరువుల లేని లోటు తీరుస్తుందని అన్నారు. అలాగే డ్రోన్ వల్ల రైతుకు ఖర్చు తగ్గుతుందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్ సహాయంతో స్ప్రేయింగ్ చేయవచ్చేనని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ, సిబ్బంది కె.రాజేశ్వరమ్మ, కమలమ్మ, రమాదేవి పాల్గొన్నారు.